# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 18-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- 21వ శతాబ్దంలో అంతర్జాతీయంగా సాగుతున్న ప్రగతిలో తూర్పు దేశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.
- భారతదేశంలో ప్రజాస్వామ్యం నానాటికీ మరింతగా బలోపేతం అవుతోందని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు.
- దేశంలో సృజనాత్మక పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతోందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.
- వికసిత భారతదేశం ఆకాంక్షను సాకారం చేసేందుకు యువత కీలకంగా వ్యవహరించాలని కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ కోరారు.

==============================

ప్రపంచ అభివృద్ధిలో తూర్పు దేశాల భాగస్వామ్యం పెరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. 21వ శతాబ్దంలో అంతర్జాతీయంగా సాగుతున్న ప్రగతిలో తూర్పు దేశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. బీహార్ లోని మోతిహారిలో ఈరోజు 7,200 కోట్ల రూపాయల అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, భారతదేశ అభివృద్ధిలోనూ తూర్పు రాష్ట్రాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. బీహార్ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేస్తూ..

(వాయిస్ బైట్...29 సెకన్లు)

==============================

భారతదేశంలో ప్రజాస్వామ్యం నానాటికీ మరింతగా బలోపేతం అవుతోందని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యం వైవిధ్యభరితమైన విజయం సాధించదని చాలా దేశాలు విశ్వసించాయని, కానీ భారతదేశం వాటిని తప్పుగా నిరూపించిందని ఆయన గుర్తు చేసుకున్నారు. గురుగ్రామ్‌లో ఈరోజు జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశం చర్చలు సమిష్టి పరిష్కారాన్ని నమ్మే సంస్కృతిని కలిగి ఉందన్నారు. ఈ విధానమే దేశాన్ని అనేక సవాళ్లను ఎదుర్కోగల సామర్థ్యాన్ని అందించిందని అన్నారు.
కాగా, ఈనాటి యువత కేవలం ఉద్యోగార్థులు మాత్రమే కాదు, ఉద్యోగ సృష్టికర్తలుగా మారుతున్నారని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యం వైపుగా సాగేందుకు భారతీయ యువత సహకారం ఎంతో అవసరమని స్పీకర్ అన్నారు.

==============================

వికసిత భారతదేశం ఆకాంక్షను సాకారం చేసేందుకు యువత కీలకంగా వ్యవహరించాలని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ కోరారు. నోయిడాలో ఈరోజు జరిగిన 2025 భారతదేశ అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతాన్ని

ఆవిష్కరించాల్సి ఉందని అన్నారు. అందుకు యువత భాగస్వామ్యం ఎంతో  అవసరమని చెప్పారు. ప్రస్తుతం భారత దేశం వేగంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. అంకితభావం, నిబద్ధతతో పనిచేయడం ద్వారా దేశం ముందు ఉన్న లక్ష్యాలను సాధించగలమని పియూష్ గోయల్ తెలియజేస్తూ..

(వాయిస్ బైట్...32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వేవ్స్ ఓటీటీ డిజిటల్ ఆవిష్కరణలతో భారతదేశ వైవిధ్యం సృజనాత్మకతను ముందుకు తీసుకెళ్తున్నామని ప్రసారభారతి ఛైర్మన్ నవనీత్ సెహగల్ అన్నారు. ప్రసార భారతి డిజిటల్ ప్లాట్‌ఫామ్ వేవ్స్ ఓటీటీ ఈరోజు న్యూఢిల్లీలోని ఆకాశవాణి భవన్‌లో తన ఫీచర్ ఫిల్మ్ డెల్లా బెల్లా బద్లేగి కహానీ ప్రీమియర్ ని ప్రదర్శించింది. ఈ సందర్భంగా పాత్రికేయులతో నవనీత్ సెహగల్ మాట్లాడుతూ, వేవ్స్ ఓటీటీ భారతదేశపు ఏకైక ప్రజా సేవా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ అని అన్నారు. విశ్వసనీయమైన, కుటుంబపరమైన ఓటీటీ  వేదికను సృష్టించడమే ప్రసారభారతి లక్ష్యమని చెప్పారు. ఈ వేదిక ద్వారా డాక్యుమెంటరీలు, రేడియో కార్యక్రమాలు, ప్రాంతీయ సినిమాలు, వంటివి అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. దేశంలోని ప్రతీ మూలకు తీసుకెళ్లడానికి WAVES కంటే మెరుగైన OTT వేదిక మరొకటి లేదని డెల్లా బెల్లా బద్లేగి కహానీ చిత్ర దర్శకుడు నీలేష్ జైన్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్  కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 25వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో సృజనాత్మక పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతోందని కేంద్ర ఐటీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ముంబైలోని NFDC ప్రాంగణంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ (IICT) మొదటి క్యాంపస్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తో కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సృజనాత్మక రంగం దేశీయ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. ప్రపంచ సృజనాత్మక, సాంకేతిక ఆర్థిక వ్యవస్థలో భారతదేశం సామర్థ్యాన్ని వాటాను పెంపొందించే దిశగా గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. యువతకు సాధికారత కల్పించడం అనేది కూడా ఇందులో భాగంగా ఉందని కేంద్రమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్...23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ప్రాంతాలను అనుసంధానించడమే కాకుండా ఆర్థిక వృద్ధిని కూడా సాధించగలమని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా అన్నారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన రోడ్డు రహదారుల అభివృద్ధికి సంబంధించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి రహదారులు రవాణా మౌలిక సదుపాయాలను కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని చెప్పారు. దేశంలో జాతీయ రహదారులు 2014లో 91 వేల కిలోమీటర్లు ఉంటే ఇప్పటికి ఒక కోటి 46 లక్షల కిలోమీటర్లకు విస్తరించాయని తెలిపారు. దీంతో ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద రహదారి వ్యవస్థగా భారతదేశం మారిందని గుర్తుచేశారు. మౌలిక సదుపాయాలతోనే ప్రగతి ఆధారపడి ఉందని హర్ష్ మల్హోత్రా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత రెండేళ్లు స్తబ్దుగా ఉన్న భారత్-కెనడా సంబంధాల పునరుద్ధరణకు మళ్లీ ప్రయత్నాలు ప్రారంభమయ్యామని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇరు దేశాలు హైకమినర్లను నియమించే పనిలో ఉన్నాయని వెల్లడించింది. ఈ మేరకు భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. జీ7 సదస్సు సందర్భంగా ఇరు దేశాల నేతలు భారత-కెనడా సంబంధాల ప్రాముఖ్యతను, మళ్లీ పునరుద్ధరించే విషయంపై

చర్చించారని తెలిపారు. అందుకోసం ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని అన్నారు. రెండు దేశాల రాజధానుల్లో హైకమిషనర్ల నియామకంపై కూడా కృషి కొనసాగుతోందని చెప్పారు. భారత్-కెనడా సంబంధాల్లో వచ్చిన మార్పుపై భారత్ సానుకూలంగా ఉందని రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడించారు.

==============================

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపుర్ జిల్లాలో ఈరోజు జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు నక్సల్స్ మృతి చెందారని పోలీసు అధికారులు తెలిపారు. అబుజ్‌మడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో ఛత్తీస్‌గఢ్ పోలీసులు, భద్రత దళాలతో కలిసి యాంటీ నక్సల్స్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలోనే భద్రతా దళాలకు మావోయిస్టులు తారసపడగా ఇరువైపుల నుంచి ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల అనంతరం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో ఆరుగురు నక్సల్స్ మృత దేహాలను భద్రత దళాలు గుర్తించాయి. ఏకే 47, SLR రైఫిల్స్‌తో పాటు మరికొన్ని ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి.

==============================

==============================